క్లుప్తంగా

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



పిఠాపురం ఆసుపత్రిలో సింహాచలానికి పింఛను అందజేస్తున్న వలంటీర్ అనుదీపిక

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం గ్రామానికి చెందిన వృద్ధుడు బొందల సింహాచలం అనారోగ్యంతో పిఠాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతను పింఛనుదారుడు కావడంతో గ్రామ వలంటీర్ ఐ.అనుదీపిక తన సొంత ఖర్చులతో పిఠాపురం ఆసుపత్రి వెళ్లి సింహాచలానికి వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేసింది. వలంటీర్ అనుదీపికను ఎంపీడీఓ పసుపులేటి సతీష్, పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి, గ్రామ సర్పంచ్ తదితరులు అభినందించారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



గండేపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గండేపల్లి: ప్రభుత్వం ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.సౌమ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గండేపల్లిలో హెల్త్‌ఫర్ ఆల్ అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ హెల్త్ వైజర్లు రూతమ్మ, చెల్లారావు, హేలేనా, సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువజ్ఝల అవధాని, కోట శ్రీనివాస్, చిట్టెం వాసు, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడికి అబ్దుల్ కలాం అవార్డు



సత్యనారాయణకు అబ్దుల్ కలాం అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్‌ఎంపీ) వైద్యుడు యడ్ల సత్యనారాయణకు ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు లభించింది. జి.కొత్తపల్లి పరిసర గ్రామాల్లో సుదీర్ఘ కాలంగా అందిస్తున్న వైద్య సేవలకు గాను ఢిల్లీకి చెందిన మ్యాజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీ సత్యనారాయణకు అవార్డును ప్రదానం చేసింది. అవార్డు గ్రహీత సత్యనారాయణకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

అన్నసమారాధన

ప్రత్తిపాడు: శ్రీరామనవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక కొత్తపేట రామాలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్తిపాడుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తుని మండలం ఎస్.అన్నవరంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న నాయకులు



వేమవరంలో 'జగనన్నే మా భవిష్యత్'ను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు



జగపతినగరంలో లబ్ధిదారుడికి పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పండగలా 'జగనన్నే మా భవిష్యత్'

పల్లెలు, పట్టణాలు జగనన్నే మా భవిష్యత్తు నినాదంతో హోరెత్తాయి. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు బృందాలుగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల ఫోన్ల నుంచి 82960 82960 నంబరుకు మిస్డ్ కాల్స్ చేయించారు. ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించారు.

- ఇంటింటా పర్యటించిన నాయకులు
- గ్రామాల్లో విశేష స్పందన



శంఖవరంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, నాయకులు

జగ్గంపేట/తునిరూరల్/తొండంగి/గండేపల్లి/ఏలేశ్వరం/కిర్లంపూడి/గోకవరం/తుని: రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవితో కలసి శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సచివాలయం–1 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. తుని మండలం ఎస్.అన్నవరంలో సచివాలయాల మండల కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. లోవ కొత్తూరులో ఎస్సీ సెల్ జిల్లా కమిటీ సభ్యుడు లంక కృపానందం, వల్లూరులో మాజీ వైస్ ఎంపీపీ కుర్ర బాబ్జి, కేఓ మల్లవరంలో ఏఎంసీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. తొండంగి మండలంలోని వేమవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ సీనియర్ నాయకుడు గాబు రాజు తదితరులు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ కఠారి లక్ష్మణ్, సర్పంచ్ మారేటి కృష్ణ పాల్గొన్నారు. ఏవీ నగరంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గండేపల్లి మండలంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కిర్లంపూడి మండలం జగపతినగరంలో సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్ ఆధ్వర్యంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గోకవరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దాసరి రమేష్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తునిలో వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

శంఖవరం: గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్, పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో ప్రతి గడపకూ వెళతామన్నారు. గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు 14 రోజుల పాటు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు పెద్దపీట వేసి రాజకీయాల్లో వారికి కీలక పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పర్వత రాజుబాబు, గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ గొల్లు చిన్నదివాణం, పార్టీ మండలాధ్యక్షులు నరాల శ్రీను, జిగిరెడ్డి శ్రీను, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, కొండమూరి చంటిబాబు, వాసిరెడ్డి భాస్కరబాబు తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న ఒమ్మి రఘురాం, జెడ్పీటీసీ బింధుమాధవి

ఆర్థికాభివృద్ధిలో వ్యాపారుల పాత్ర కీలకం

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా



తుని కిరాణా వర్తకసంఘం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో వ్యాపారుల పాత్ర కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. స్థానిక బెల్లపువీధిలోని కన్యకా పరమేశ్వరి ఆయల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం కిరాణా వర్తక సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం పెనుమూడి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో నూతన పాలకవర్గం అధ్యక్షుడిగా గ్రంధి కొండలరావు, కార్యదర్శి కట్టమూరి సూర్యకృష్ణ, కోశాధికారిగా చెక్కా వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వెలగా వెంకట సూకరాజు, సహాయ కార్యదర్శిగా కేదారిశెట్టి రవితేజ, సహాయ కోశాధికారిగా పచ్చిగోళ్ల లప్పలరాజు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గాన్ని మంత్రి రాజా ఘనంగా సత్కరించారు. వ్యాపారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, నిజాయితీగా వ్యాపారం చేసుకోవాలని మంత్రి సూచించారు. తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కంకిపాటి జమీల్, వైఎస్సార్ సీపీ తుని మండల పార్టీ అధ్యక్షుడు పోతల రమణ, సకురు నాగేంద్ర నెహ్రూ, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పోర్టు నిర్మాణ పనుల పరిశీలన



పెరుమాళ్లపురంలో పోర్టు పనులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో నిర్మిస్తున్న కాకినాడ గేట్ వే పోర్టు పనులను జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. అరబిందో సంస్థ ఆధ్వర్యంలో ఈ పోర్టును నిర్మిస్తున్నారు. కాగా ఎస్పీ నిర్మాణ పనులను పరిశీలించి పోర్టు కార్యకలాపాలపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. భద్రతా చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్‌బీ డీఎస్పీ అంబికా ప్రసాద్, పెద్దాపురం డీఎస్పీ ఎస్ మురళీ మోహన్, తుని రూరల్ సీఐ సన్యాసిరావు, తొండంగి ఎస్సై ఎస్ రవికుమార్ ఇతర సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటా పర్యటన

జగ్గంపేట: గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకునే కార్యక్రమాన్ని తన స్వగ్రామం ఇర్రిపాక నుంచి శనివారం ప్రారంభించనున్నట్టు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో వివిధ కేటగిరీలకు చెందిన టీడీపీ నేతలకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు.

తాటిముంజెలకు భలే గిరాకీ



ఏలేశ్వరంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న తాటిముంజెలు

ఏలేశ్వరం: ప్రస్తుతం ఎండలు మండిపోవడంతో తాటిముంజెలకు గిరాకీ పెరిగింది. వేసవిలో మాత్రమే ఇవి అందుబాటులో ఉండడంతో వీటికోసం ప్రజలు క్యూ కడుతున్నారు. వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు వీటిలో పోషకాలు అధికంగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు జనం అసక్తి చూపుతున్నారు. తాటిచెట్లకు ఉండే కాయల నుంచి వీటిని తీసి వేర్వేరుగా అమ్ముతున్నారు. డజన్‌కు రూ.30 నుంచి రూ.35 వరకు విక్రయిస్తున్నారు. వేసవిలో తాటి ముంజెలను పంచదారతో కలిపి తింటే ఆ రుచి అమోఘమని పెద్దలు చెబుతున్నారు. ఏలేశ్వరంలో కల్లుగీత కార్మికులు పలుచోట్ల దుకాణాలు వేసి వీటిని అమ్ముతున్నారు. ఉదయం నుంచి అమ్మకాలు ప్రారంభించగా మధ్యాహ్నానికే హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. వీటిని విక్రయించి పలువురు కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు.

'అందరికీ ఆరోగ్యం' నినాదంతో వాక్‌థాన్

కాకినాడ క్రైం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ శాఖ, రంగరాయ వైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పిలుపునిచ్చిన 'అందరికీ ఆరోగ్యం' నినాదాన్ని పలుకుతూ వాక్‌థాన్ చేపట్టారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోకా పవన్‌కుమార్ ఈ వాక్‌థాన్‌ను ఆర్‌ఎంసీ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలతాదేవి, డాక్టర్ దేవి మాధవి మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ఆహారం, అలవాట్లే వ్యక్తి ఆరోగ్యాన్ని నిర్దేశించే అంశాలని పేర్కొన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ), ఆర్‌ఎంసీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ భాగస్వాములుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి చిట్ల కిరణ్, ఐడీఏ కాకినాడ పూర్వాధ్యక్షుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు



ఏలేశ్వరంలో ఏసుక్రీస్తు శిలువతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



హంసవరంలో శిలువ చేతపట్టి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



కిర్లంపూడి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ప్రత్తిపాడు మరియగిరిపై ఏసుకు శిలువ వేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: లోకరక్షకుడు ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజును పురస్కరించుకుని శుక్రవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరంలో ఆర్‌సీఎం చర్చి నుంచి ఏసుక్రీస్తు శిలువతో ఊరేగింపు నిర్వహించారు. పాస్టర్ థామస్ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి, మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, హనుమాన్ జంక్షన్ మీదుగా ఊరేగింపు సాగింది. లూథరన్ చర్చిలో పాస్టర్ సామ్యూల్ రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

క్రైస్తవుల ర్యాలీ

తుని రూరల్: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని హంసవరంలో క్రైస్తవులు సిలువ చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి పాస్టర్ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు సిలువతో గ్రామంలో ర్యాలీ చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీ అవినాష్, క్రైస్తవులు పాల్గొన్నారు.

గోకవరం: మండల వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. గోకవరం సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్, సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాల్లో క్రైస్తవులు శిలువతో ర్యాలీలు చేశారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, ఏలూరు, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి తదితర గ్రామాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడులోని ఆర్‌సీఎం చర్చి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దివ్యబలి పూజ, ఉపవాస ఆరాధనల్లో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఏసు వృత్తాంత ప్రదర్శనలు

స్థానిక ఆర్‌సీఎం పాస్టర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి నుంచి క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని వివరిస్తూ పుర ప్రదర్శన నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి నుంచి మరియగిరి పుణ్యక్షేత్రం వరకు సాగిన ఈ యాత్రలో వందలాది మంది క్రైస్తవులు, మఠకన్యలు పాల్గొన్నారు. శిలో మార్గంలో ఏసుక్రీస్తు తన భుజాలపై శిలువను మోయడం, ముళ్ల కిరీట ధారణ, ఏసు శిలువ మోసే క్రమంలో కింద పడిపోవడం, శిలువపై క్రీస్తును ఉంచి చేతులు, కాళ్లపై మేకులు కొట్టడం, సమాధి చేయడం వంటి నిజరూప దృశ్య మాలికలను ప్రదర్శించారు. మరియగిరిపై ఏసుక్రీస్తు శిలువ ఘట్టాన్ని ప్రదర్శించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కిర్లంపూడి: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కిర్లంపూడి సెయింట్ పాల్ లూథరన్ చర్చి, ఇమ్మానియేల్ ప్రార్థన మందిరం, జగపతినగరం డివైన్ ప్రేయర్ మందిరంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ఏసు శిలువ యాత్ర నిర్వహించారు.